క్లుప్తంగా

అభివృద్ధి పనులపై మంత్రి పెద్దిరెడ్డికి వినతి



మంత్రిని కలసిన ఎమ్మెల్సీ భరత్, వైఎస్సార్ సీపీ నేతలు

రామకుప్పం: మండలంలో చేయాల్సిన అభివృద్ధి పనుల గురించి చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి నివేదించారు. రామకుప్పంలో సీసీ రోడ్లు వేయాలని కోరారు. దీనిపై స్పందించిన సీసీ రోడ్లు వేయాలని సంబంధిత అధికారులను ఆదేశించాలని మంత్రి జిల్లా కలెక్టర్‌కు ఫోన్‌లో ఆదేశించినట్లు వారు తెలిపారు. అలాగే, మండలంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్సీకి మంత్రి సూచించారు. మంత్రిని కలిసిన వారిలో వైఎస్సార్ సీపీ నేతలు జమీను ప్రసాద్, పెద్దన్న, యశ్వంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

నాగదేవతల రాళ్ల ప్రతిష్ఠ



అలంకరణలో నాగదేవతల విగ్రహరాళ్లు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని ఎర్రపాపిరెడ్డిగారిపల్లెలో ఆదివారం కొత్తగా నాగదేవత రాళ్ల ప్రతిష్ఠ, అశ్వర్థనారాయణ కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు అనంతాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

పేద పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ



పిల్లలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేసి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న సభ్యులు

పలమనేరు: పట్టణంలోని లయన్స్ సేవా కేంద్రంలో పేద పిల్లలకు 30 పౌష్టికాహారాలను చెన్నైకి చెందిన లవ్ ఇన్ యాక్షన్ ట్రస్ట్ నిర్వాహకులు ఆదివారం పంపిణీ చేశారు. జన్మదిన వేడుకలను జరుపుకుంటున్న పిల్లలకు కేక్‌కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ పౌష్టికాహారాన్ని రెండు నెలల పాటు పంపిణీ చేయనున్నట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు విమలా రీస్, రామచంద్రయ్య, హేమలత, రెడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమావేశాలకు వెళ్లిన ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

పుంగనూరు: గుడ్ గవర్నెన్స్‌పై శ్రీనగర్‌లో మూడు రోజులపాటు నిర్వహించనున్న జాతీయ స్థాయి సమావేశాల్లో పాల్గొనేందుకు మన రాష్ట్రం తరపున పుంగనూరు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి ఆదివారం బయల్దేరి వెళ్లారు. ఈయనతో పాటు మన రాష్ట్రం నుంచి ఏడుగురు ప్రతినిధులు వెళ్లారు. రాష్ట్రం నుంచి ఎంపీపీలలో భాస్కర్‌రెడ్డి మాత్రం అవకాశం లభించింది.

మానవ సేవే మాధవ సేవ



ప్రభోదానంద పుస్తకాలపై ప్రచారం చేస్తున్న సంస్థ ప్రతినిధులు

కుప్పం రూరల్: మానవ సేవే మాధవ సేవని ప్రభోదానంద సేవా సమితి కుప్పం ప్రతినిధి కృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని మటార్లపల్లె, రాజనం గ్రామాల్లో ప్రబోధానంద విరచిత త్రైత సిద్ధాంత భగవద్గీత, ఇతర పుస్తకాలపై ప్రచారం నిర్వహించారు. కృష్ణ మాట్లాడుతూ, భగవద్గీతలో లేని నీతంటూ లేదని, ప్రతి ప్రశ్నకు భగవద్గీతలో సమాధానం లభిస్తుందన్నారు. ముఖ్యంగా శ్రీ కృష్ణుడు మానవ సేవే మాధవ సేవ అని ప్రస్ఫుటంగా చెప్పారని, ప్రతి ఒక్కరూ ఇతరులకు సాయపడడం అలవరచుకోవాలని కోరారు. అలాగే ప్రతి ఒక్కరూ కులమతాలకు అతీతంగా భగవద్గీత పఠనం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాగరాజు, కృష్ణ, శివకృష్ణ, మంజునాథ్, శరవణ, సుధాకర్, వెంకటలక్ష్మి, ఇందిర, యశస్విని పాల్గొన్నారు.

భగవద్గీతపై ప్రచారం

పలమనేరు: మండలంలోని బేరుపల్లెలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పలమనేరు, బంగారుపాళెం కమిటీ సభ్యులు మాట్లాడారు. వివిధ గ్రంథాలను పంచారు. హిందూ ధర్మం వ్యాప్తికే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రతి ఒక్కరూ ధర్మబద్ధులై నడుచుకుంటే సమాజంలో అశాంతికి స్థానం ఉండదన్నారు. కమిటీ అధ్యక్షుడు బాలాజి, సభ్యులు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ క్లీన్ స్వీప్!

- నియోజకవర్గవ్యాప్తంగా అన్ని వార్డుల్లోనూ గెలుపు

పలమనేరు: నియోజకవర్గంలో పలు కారణాలతో ఖాళీల మూలాన నిర్వహించిన పంచాయతీల వార్డు సభ్యుల ఎన్నికల్లో అన్ని చోట్లా వైఎస్సార్ సీపీ క్లీన్ స్వీప్ చేసింది. ఆ పార్టీ సానుభూతి పరులే వార్డు సభ్యులుగా ఎన్నికయ్యారు. బైరెడ్డిపల్లె మండలం బేలుపల్లె, గొనితిమ్మేపల్లె, పలమనేరు మండలం కరిడిమొడుగు, గంగవరం మండలం చౌడిరెడ్డిపల్లె వార్డులు వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులకు ఏకగ్రీవమయ్యాయి. వీ.కోట మండలంలోని కొంగాటం పంచాయతీలో ఓ వార్డుకు శనివారం జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుడే విజయం సాధించాడు. ఇక పెద్దపంజాణి మండలం పెద్దారికుంట పంచాయతీలోని ఓ వార్డుకు ఎస్టీ రిజర్వుడు అభ్యర్థులు లేక ఎన్నిక జరగలేదు. మొత్తం మీద ఏడు వార్డుల్లోనూ వైఎస్సార్‌సీపీ సొంతం చేసుకుంది.

- మొత్తం 8 చోట్ల వార్డు మెంబర్లకు ఎన్నికలు నిర్వహించగా, పెద్దారికుంటలో ఎస్టీ అభ్యర్థులు లేకపోవడంతో ఎన్నికలు జరగలేదు.
- మిగిలిన ఏడు చోట్లలో ఆరుచోట్ల వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఏకగ్రీవం అయ్యారు
- వీ.కోట మండలంలోని కొంగాటంలో ఒకటో వార్డుకు జరిగిన ఎన్నికలో వైఎస్సార్‌సీపీ నుంచి వరలక్ష్మి 122 ఓట్ల మెజారిటీతో గెలిచింది. ఆమెను పలువురు అభినందించారు.

పలమనేరు నియోజకవర్గం

మండలం	పంచాయతీ	వార్డు నం.	గెలుపొందిన అభ్యర్థి	పార్టీ	ఎన్నికవిధానం
బైరెడ్డిపల్లె	గొనితిమ్మేపల్లె	2	సి.రెడ్డెప్ప	వైఎస్సార్‌సీపీ	ఏకగ్రీవం
బైరెడ్డిపల్లె	బేలుపల్లె	7	భరత్‌కుమార్	వైఎస్సార్‌సీపీ	ఏకగ్రీవం
పలమనేరు	కరిడిమొడుగు	4	శ్రీనివాసులు నాయుడు	వైఎస్సార్‌సీపీ	ఏకగ్రీవం
గంగవరం	చౌడిరెడ్డిపల్లె	4	వెంకటేష్	వైఎస్సార్‌సీపీ	ఏకగ్రీవం
వీకోట	నెర్నిపల్లె		ముబారక్	వైఎస్సార్‌సీపీ	ఏకగ్రీవం
వీకోట	చింతమాకులపల్లె	5	సుందరం	వైఎస్సార్‌సీపీ	ఏకగ్రీవం
వీకోట	కొంగాటం	1	వరలక్ష్మి	వైఎస్సార్‌సీపీ	ఎన్నిక
పెద్దపంజాణి	పెద్దారికుంట	4			ఎన్నిక జరగలేదు



సి.రెడ్డెప్ప, భరత్‌కుమార్, శ్రీనివాసులు నాయుడు, వెంకటేష్, ముబారక్, సుందరం, వరలక్ష్మి

పుంగనూరు నియోజకవర్గం వార్డు మెంబరుగా డి.క్రిష్ణవేణి



పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండలం గడ్డంవారిపల్లె పంచాయతీలో 10 వార్డుకు వైఎస్సార్ సీపీ సానుభూతిపరురాలు డి.క్రిష్ణవేణి ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆమెను పలువురు అభినందించారు.

కందూరు 4వ వార్డు ఏకగ్రీవం



సోమల: మండలంలోని కందూరు పంచాయతీ 4వ వార్డు స్థానం ఎన్నికలలో వైఎస్సార్ సీపీ మద్దతుదారుడు మనోజ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి అనూష తెలిపారు.

పుదిపట్ల 4వ వార్డు సభ్యుడిగా నరసింహులు



చౌడేపల్లె: మండలంలోని పుదిపట్ల పంచాయతీ 4వ వార్డు మెంబర్‌గా వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు వేముల నరసింహులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడని రిటర్నింగ్ అధికారి కేశవరెడ్డి తెలిపారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

సదుం: ప్రపంచ దోమల దినోత్సవం పురస్కరించుకుని చెరుకువారిపల్లె సీహెచ్‌సీ ఆదివారం సదుంలో అవగాహన ర్యాలీ నిర్వహించింది. సీహెచ్‌సీ డాక్టర్ అనురాధ మాట్లాడుతూ..దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలని కోరారు. ఆడ ఎలాఫిలిస్ దోమ వలన మానవులకు మలేరియా వ్యాధి వ్యాపిస్తుందనే విషయాన్ని సర్ రోనాల్డ్ రాస్ 1897 ఆగస్టు 20న కనుగొన్న సందర్భంగా ఆ రోజును గుర్తు చేసుకుంటూ ప్రతి ఏటా ఇదే రోజున వరల్డ్ మస్కిటో డేగా నిర్వహిస్తున్నట్టు ఆమె చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్లు నీలకంఠ, ఉదయభాస్కర్, సీహెచ్‌ఓలు, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

శంఖు, చక్రం సమర్పణ



శంఖు చక్రం చూపుతున్న అర్చకులు, సభ్యుడు

చౌడేపల్లె: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండ వీరాంజనేయస్వామికి మండలంలోని తొప్పిరెడ్డిపల్లెకు చెందిన జె.జయకుమార్‌రెడ్డి, నిర్మల దంపతులు ఆదివారం శంఖు, చక్రం సమర్పించారు. కోరిన కోర్కెలు ఫలించడంతో ఆలయానికి పంచలోహంతో శంఖు, చక్రం తయారు చేయించి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు మునిరాజ, అర్చకుడు కృష్ణమూర్తికి అందజేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

కంటి ఆపరేషన్లకు 74 మంది ఎంపిక



రోగులకు కంటి వైద్య పరీక్షలు చేస్తున్న నిపుణులు

కుప్పం రూరల్: సాయిమాతా సేవా సమితి, శారదా కంటి ఆస్పత్రి(బెంగళూరు) సౌజన్యంతో ఆదివారం కుప్పంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. శిబిరానికి వచ్చిన రోగులను పరీక్షించి పలువురికి మందులు ఉచితంగా పంపిణీ చేయడమే కాకుండా 74 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేసినట్లు 'సాయి మాతా' వ్యవస్థాపకుడు జగదీష్‌బాబు చెప్పారు. సోమవారం బెంగళూరు శారదా కంటి ఆస్పత్రిలో కంటి ఆపరేషన్లు చేయిస్తామన్నారు. శారదా కంటి ఆస్పత్రి వైద్యులు శివప్రకాశ్, మౌనిక, వినోద, లావణ్య, గాయత్రి పాల్గొన్నారు.

ఎన్జీఓల సమావేశానికి తరలిన నాయకులు

పలమనేరు: విజయవాడ ఇందిరాగాంధి స్టేడియంలో ఈనెల 21, 22వ తేదీల్లో నిర్వహించనున్న ఏపీ ఎన్జీఓల రాష్ట్ర సభలకు పలమనేరు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ఉపాధ్యాయ, ఉద్యోగులు తరలి వెళ్లారు. సంఘ తాలుకా అధ్యక్షుడు ఆనందబాబు మాట్లాడుతూ, దశాబ్దాలుగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటం చేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర సభలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు లక్ష్మీపతి, హరి, రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధమైన మార్కెట్ యార్డ్ కాంప్లెక్స్



రొంపిచెర్ల మార్కెట్ యార్డ్ కాంప్లెక్స్ గదులు

రొంపిచెర్ల: రొంపిచెర్ల మార్కెట్ కమిటీ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన కాంప్లెక్స్ గదులు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రభుత్వం నుంచి రూ.50 లక్షలు మంజూరు చేయించారు. దీంతో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చల్లా లక్ష్మి 10 కాంప్లెక్స్ గదులను నిర్మించారు. ఈ గదులను ఈ నెల 26న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. అలాగే రూ.10 లక్షలతో మార్కెట్ యార్డులో సిమెంటు రోడ్లు వేస్తున్నారు. మంత్రి సహకారంతో మార్కెట్ కమిటీ యార్డును అభివృద్ధి చేసినట్లు చల్లా లక్ష్మి చెప్పారు.

ఉపాధి పనుల తనిఖీ

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని 25 పంచాయతీలలో ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2023 వరకు ఉపాధి హామీ పథకంలో చేసిన వివిధ పనులను సామాజిక తనిఖీ బృందం తనిఖీలకు పూనుకుంది. క్షేత్ర స్థాయిలో చేసిన పనులను వారం పాటు ఈ బృందం పరిశీలించి, మండల స్థాయిలో జరిగే గ్రామసభలో అధికారుల సమక్షంలో నివేదిస్తుందని సంబంధిత అధికారులు తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



కుటుంబ సభ్యులతో విరాళం ఇస్తున్న వరప్రసాద్

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో నిత్యాన్నదానానికి ఆదివారం యాదమరి మండలం కుక్కలపల్లెకు చెందిన వరప్రసాద్ రూ.లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. దాత, కుటుంబసభ్యులకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

22న రక్తదాన శిబిరం

పుంగనూరు: పట్టణంలోని రోటరీక్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 22న శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటలకు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు రోటరీక్లబ్ నిర్వాహకులు ఆదివారం తెలిపారు.

పుంగమ్మ చెరువు కట్టకు మహర్దశ





పుంగనూరు నుంచి బెంగళూరుకు వెళ్లే పుంగమ్మ చెరువు కట్టపై చేస్తున్న విస్తరణ పనులు, చెరువు కట్ట పొలాల వద్ద నిర్మిస్తున్న కాంక్రీట్ గోడలు

పుంగనూరు: జమీందారుల కాలంలో నిర్మించిన పుంగమ్మ చెరువు కట్ట రోడ్డుకు మహర్దశ ప్రాప్తించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిధున్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. పట్టణం నుంచి బెంగళూరుకు వెళ్లే ప్రధాన రహదారి పుంగమ్మ చెరువు కట్టపై ఉంది. చెరువు కట్ట గుంతలమయమై, విస్తరణకు నోచుకోకపోవడంతో ప్రజలకు ఈ మార్గంలో ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఓ వైపు సుమారు 30 అడుగులు లోతున ఉన్న పొలాలు, మరోవైపు చెరువు ఉండడంతో ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకుని పలువురు మృత్యువాత పడటమే కాకుండా మరెందరో క్షతగాత్రులయ్యారు. ఈ నేపథ్యంలో ఎంపీ మిధున్‌రెడ్డి కర్ణాటక జాతీయ రహదారి నుంచి పుంగనూరు నియోజకవర్గంలోని రొంపిచెర్లకు జాతీయ రహదారిని అనుసంధానం చేయించారు. అలాగే పుంగనూరు, బెంగళూరు, జాతీయ రహదారి విస్తరణ పనులకు కోట్లాది రూపాయలు విడుదల చేయించి పనులు ప్రారంభించారు. చెరువు కట్టపై సుమారు మూడు వాహనాలు సులభంగా ప్రయాణించేలా సుమారు 100 అడుగులతో రోడ్డు విస్తరణకు శ్రీకారం చుట్టారు. అలాగే కట్టకు మరో వైపు పొలాల్లో చెరువు కట్ట దెబ్బతిని ప్రమాదాలు సంభవించకుండా దృఢంగా కాంక్రీట్ వేసి సుమారు రెండు కిలోమీటర్ల పొడవుతో గోడలు నిర్మిస్తున్నారు. పుంగనూరు నుంచి యాబై రాళ్ల మొరవ, సింగిరిగుంట, అరవపల్లె మీదుగా కర్ణాటక సరిహద్దు పనులు, అలాగే పుంగనూరు నుంచి రామసముద్రం వెళ్లే రహదారి పనులు చురుగ్గా చేస్తున్నారు. పుంగమ్మ చెరువు కట్టపై ఉన్న వినాయకస్వామి ఆలయ వెనుక భాగం నుంచి బెంగళూరు రోడ్డుకు అనుసంధానం చేస్తూ రోడ్డు వేస్తున్నారు. ఏళ్ల కాలంగా అభివృద్ధికి నోచుకోని బెంగళూరు రోడ్డు పనులు చురుగ్గా చేస్తుండడంతో ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గొంతెండుతున్న పెద్దినేపల్లె



నీటి కోసం గుమిగూడిన ప్రజలు

గంగవరం: మండలంలోని పత్తికొండ పంచాయతీ పెద్దినేపల్లెలో వారం రోజులుగా తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ 130 కుటుంబాలు ఉన్నాయి. డైరెక్ట్ పంపింగ్ బోరులో నీరు అడుగంటి, సన్నగా వస్తుండడంతో తాగునీటి కష్టాలు కష్టాలు మొదలయ్యాయి. ప్రజల విజ్ఞప్తిపై స్పందించిన ఏఎంసీ డైరెక్టర్ సిద్ధప్ప తన సొంత ఖర్చులతో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయించారు. ట్యాంకర్ నీటిని డైరెక్ట్ పంపింగ్ బోరు వద్ద డ్రమ్ముల్లో పోయించారు. దీంతో ఆ నీటి కోసం గ్రామ మహిళలు బిందెలు, ఇతర పాత్రలతో ఇలా మూగారు. అలాగే తాగునీటి సమస్యను ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో జెడ్పీ నిధులు మంజూరు చేసి గ్రామంలో బోరు వేస్తామని హామీ ఇచ్చినట్టు ఆయన తెలిపారు.

నేడు న్యాయవాదుల భవన నిర్మాణానికి భూమి పూజ

పుంగనూరు: పట్టణంలోని కోర్టు ఆవరణలో న్యాయవాదుల సంఘ భవన నిర్మాణ పనులను మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోమవారం ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి న్యాయవాదులు అన్ని ఏర్పాటు పూర్తి చేశారు. న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు గల్లా శివ శంకర్‌నాయుడు, న్యాయవాదులు కలసి గత నెలలో న్యాయవాదుల భవన నిర్మాణానికి ఐదు సెంట్ల స్థలం, నిధులు మంజూరు చేయాలని మంత్రి పెద్దిరెడ్డిని కోరారు. దీనిపై మంత్రి స్పందించి 5 సెంట్ల భూమిని గత వారం కేటాయించి, తహసీల్దార్ ద్వారా ఉత్తర్వులు అందజేశారు. ఆ స్థలంలో న్యాయవాదుల సంఘ భవనం నిర్మించేందుకు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిధున్‌రెడ్డి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప నిధుల నుంచి రూ.30 లక్షలు మంజూరు చేయించారు. ఈ పనులకు మంత్రి భూమి పూజ చేయడంతోపాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

ఆటో చోరీ

- 24 గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులు
- ఆటోతో కర్ణాటకకు వెళ్తున్న నిందితుడిని పట్టివేత

గంగవరం: ఇంటి ముందు నిలిపి ఉంచిన ఆటో చోరీకి గురైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితుడు సుబ్రమణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు..మండలంలోని రెంటకుంట్ల గ్రామానికి చెందిన సుబ్రమణ్యం అలియాస్ మణి ఆటోను లీజుకు నడుపుతున్నాడు. శుక్రవారం రాత్రి ఇంటి ముందు ఆటోను నిలిపి ఉంచి నిద్రపోయాడు. ఉదయం నిద్ర లేచి చూసేసరికి ఇంటి ముందున్న ఆటో లేకపోవడంతో పరిసర ప్రాంతాల్లో గాలించాడు. ఎవరో చోరీ చేశారని గ్రహించిన బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఇదే గ్రామానికి చెందిన మనోజ్(29) రెండు రోజులుగా కనిపించకపోవడంతో అతడిని అనుమానించారు. సెల్‌ఫోన్ ట్రాకింగ్ ద్వారా కర్ణాటక రాష్ట్రం ముళబాగిల్ వద్ద ఆటోతో వెళ్తున్నట్టు గుర్తించారు. నిందితుడి అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆటోను స్టేషన్‌కి తరలించారు. ఇదలా ఉంచితే, గ్రామంలో చిన్నాచితకా దొంగతనాలు మనోజ్ చేసేవాడని, గ్రామస్తులే కొన్ని పర్యాయాలు పట్టుకుని దేహశుద్ధి చేసినట్లు తెలిసింది. మనోజ్ తీరుపై విసుగు చెంది అతడిని భార్య సైతం వదలి వెళ్లినట్లు తెలియవచ్చింది. ఇక, చోరీ చేసిన ఆటోను కర్ణాటకలో విక్రయించి సొమ్ము చేసుకుందామని తీసుకెళ్తుండగా పోలీసులు సకాలంలో స్పందించి, అతడిని ఆటోతో సహా పట్టుకున్నారు.

ఉద్యమాలతోనే సమస్యలకు పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న విఠపు బాలసుబ్రమణ్యం

- ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం

పలమనేరు: ఉద్యమాలతోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబమణ్యం అన్నారు. ఆదివారం జిల్లా యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశం పట్టణంలోని లయన్స్‌సేవా కేంద్రంలో నిర్వహించారు. ముఖఅయతిథిగా ఆయన మాట్లాడుతూ, హక్కుల సాధనే లక్ష్యంగా అందరూ పనిచేయాలన్నారు. ఉపాధ్యాయుల హక్కుల సాధనలో యూటీఎఫ్ ఎనలేని కృషి చేస్తోందన్నారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్, రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, రఘునాథరెడ్డి, జీవీరమణ, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.